క్లుప్తంగా

పశువులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి నరేంద్రకుమార్

తెర్లాం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని నెమలాం పశువైద్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో ఈ సీజన్‌లో ఎక్కువగా జబ్బవాపు వ్యాధి సోకుతుందని, దీని నివారణకు అవసరమైన టీకాలను పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నామన్నారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకందారులు వారి వద్ద ఉన్న జీవాలకు చిటుకు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు: డీఎస్పీ



ఎస్.సీతారాంపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం: ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, కోడ్ ఉల్లంఘించిన, గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. సీఐ తిరుమలరావుతో కలిసి బుధవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, ఒకరిపై ఒకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. బెట్టింగులకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రాజకీయాలు వదిలేసి ఒకరికొకరు సోదరభావంతో మెలగాలని సూచించారు. వారి వెంట ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఉన్నారు.

నేడు బీసీజీ టీకా పంపిణీ

సంతకవిటి: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్ తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, 60 ఏళ్ల పైబడిన వారు, 2021–23 సంవత్సరాల మధ్య టీబీ సోకిన వారి ఇంట్లో ఉన్న 18 ఏళ్ల పైబడిన వారు, ఎత్తుకు తగిన బరువు లేనివారు, పొగతాగే అలవాటు ఉన్న వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం



వెంకమ్మపేటలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ

రేగిడి: ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలపై వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని వెంకమ్మపేట, తునివాడ, పాతచెలికానివలస, కొత్తచెలికానివలస గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద రైతులతో సమావేశమయ్యారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, ఎరువుల వినియోగం, కలుపు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆధునిక సాగుపద్ధతులు పాటిస్తే ఖర్చు తగ్గించుకోవడంతో పాటు దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విజయలక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బాడంగి: గ్రామదేవత పండగల పేరుతో అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని, పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మండలంలోని డొంకినవలస ఈ నెల 27 నుంచి గ్రామదేవత పండగ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలతో కలిసి ఆనందంగా పండగ చేసుకోవాలన్నారు. మద్యం అమ్మకాలు, అశ్లీల నృత్యాలు, డీజేలు, పేకాట శిబిరాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్సై ఆర్.జయంతి, సిబ్బంది ఉన్నారు.

నారు మంచిదైతే.. పంట బాగుంటుంది

- ఆధునిక పద్ధతులు అనుసరిస్తే ఆశించిన దిగుబడులు
- విత్తన శుద్ధి, కలుపు నివారణపై దృష్టి సారించాలి: ఏఓ



తట్టికోట కన్నబాబు, ఏఓ

వంగర: నారుమడుల తయారీలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించినట్లయితే సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారి తట్టికోట కన్నబాబు సూచించారు. వేసవి దుక్కులు, పచ్చిరొట్ట సాగు, నారుమడుల తయారీ, విత్తనాల ఎంపిక, కలుపునివారణ, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలను అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

● నారుమడుల తయారీ ఇలా..

ప్రతీ ఎకరాకు ఐదుసెంట్ల చొప్పున నారుమడులను సిద్ధం చేసుకోవాలి. అదును చూసుకొని మూడు సార్లు దుక్కి దున్నాలి. జింకు లోపం ఉన్న భూముల్లో విత్తనాలు చల్లిన వెంటనే జింకు సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తనాలు చల్లే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. కార్బండిజం పౌడర్‌ను ప్రతీ కిలో విత్తనాలకు మూడు గ్రాములు చొప్పున విత్తనాలు చల్లే 24 గంటలు ముందు కలిపి శుద్ధి చేయాలి. ఇలా చేస్తే తెగుళ్ల కలగజేసే శిలీంద్రాన్ని నాశనం చేస్తుంది.



నారుమడిని తయారు చేస్తున్న రైతు



రైతులు నుంచి వివరాలు నమోదు చేస్తున్న వీఏఏ

● నారుమడుల్లో కలుపు నివారణ..

నారుమడుల్లో కలుపు నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విత్తనాలు చల్లిన తొలి దశలోనే రెండు గ్రాముల టాప్‌స్టార్‌ను సరిపడిన నీటిలో కలిపి పిచికారి చేయాలి. నారుతో పాటు గడ్డి మొలకెత్తిన తరువాత ప్రతీ ఐదు సెంట్లు నారుమడికి 4 ఎంఎల్ నామినీ గోల్డ్ మందును పది లీటర్లు నీటిలో కలిపి ఒక ట్యాంకును పిచికారి చేయాలి. నారుతీతకు పది రోజుల ముందు కార్బాప్ హైడ్రోక్లోరైడ్ గుణం కలిగిన 4జీ గులికలను ప్రతీ నారుమడికి అరకేజీ చొప్పున జల్లాలి. 25 రోజులు వయసు వచ్చేసరికి నారుతీసి ఉబాలు వేయాలి. అలా రైతుకు సమయం అనుకూలించక ఆలస్యం జరిగితే నారు ముదురుతుంది. అటువంటి సమయంలో ఎక్కువ నారును ఉబాల్లో వేయాల్సి ఉంటుంది.

రాజాం పట్టణంలో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ



సమావేశమైన వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ నాయకులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో వైఎస్సార్‌సీపీదే అత్యధిక మెజార్టీ అని ఆ పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు అన్నారు. రాజాం పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన పార్టీ నేతలతో బుధవారం విడివిడిగా మాట్లాడారు. ఈనెల 13న జరిగిన పోలింగ్ సరళిపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2009 నుంచి ఇప్పటి వరకు రాజాం మున్సిపాలిటీలో ప్రతీ ఎన్నికల్లో టీడీపీకి పరాభవమే మిగిలిందని, ఈ ఎన్నికల్లో కూడా టీడీపీ ఓటమి తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీకి రాజాం పట్టణంలో 2014, 2019లో వచ్చిన మెజార్టీ కంటే ఈసారి ఎక్కువ మెజార్టీ వస్తుందన్నారు. అటు రాష్ట్రంలోనూ, ఇటు రాజాంలోనూ వైఎస్సార్‌సీపీ విజయదుంధుభి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజాం ఎమ్మెల్యేగా డాక్టర్ తలే రాజేష్ భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, నాయకులు దూబ గోపాలం, ఆర్నేపల్లి వెంకటనాయుడు, వెంపల లక్ష్మణరావు, ముద్దన సత్యారావు, సలాది తులసీరావు, మంతపూడి వెంకట్, వంజరాపు విజయ్‌కుమార్, బొమ్మన సూర్యనారాయణ, కాలెపు శేఖర్, పిచ్చుక శ్రీనివాసరావు, చప్పటి పెంటయ్య, పాలవలస శ్యామ్, కలమట శంకర్, శాసపు వేణుగోపాలనాయుడు, గోకవలస బాబూరావు, ఓలేటి గణపతి, ఎస్.సతీష్, యందవ చినబాబు, సత్యం, పిట్టా జగదీష్, జేసీబీ శ్రీను, యందవ సుశీల, కోల్ల రమ్య, జినగం ఈశ్వరరావు, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి భజన మండలి రాజాం జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ బుధవారం తెలిపారు. విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని, ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందించనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పప్పల గణపతిరావు చిన్న తమ్ముడు సత్యనారాయణ(అన్నంనాయుడు) ఇటీవల మరణించారు. వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ బుధవారం గ్రామానికి వెళ్లి గణపతిరావు కుటుంబాన్ని పరామర్శించారు. సత్యనారాయణ మృతికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, గేదెల నారాయణరావు, తదితరులు ఉన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు



మారేడుబాక సమీపంలో సాగుచేస్తున్న పెసరపంట

రాజాం:

మండలంలో మారేడుబాక, సోపేరు, గార్రాజుచీపురుపల్లి, ఎం.జోగివలస తదితర ప్రాంతాల్లో వేసవి పంటగా సాగుచేసిన అపరాలు మంచి దిగుబడిని ఇస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో రైతులు మినప, పెసర, నల్లపెసర పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంటలు కోతదశకు చేరుకున్నాయి. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల కోసం ప్రతిపాదనలు

బాడంగి: ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కె.శిరీష తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండలానికి 1300 క్వింటాళ్ల వరకు విత్తనాలు అవసరమని అంచనా వేసినట్లు చెప్పారు. వాటిలో ఎంటీయూ–1121, 1060, సాంబమసూరి, సోనామసూరి, 1224 విత్తన రకాలు పంపించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోగా విత్తనాలు ఆర్‌బీకేలకు చేరుకోనున్నాయన్నారు. రాయితీపై విత్తనాలు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఖరీఫ్‌లో సాగుకు 66.30 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కావాలని ప్రతిపాదనలు పంపించామని, వాటిని 40 శాతం రాయితీపై రైతులకు అందివ్వనున్నట్లు చెప్పారు. మండలంలో ఎరువుల కొరత లేకుండా ముందస్తుగా 324 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్‌బీకేలకు తెప్పించి ఉంచామన్నారు. డీఏపీ ఎరువు త్వరలోనే వస్తుందన్నారు. ఆమె వెంట ఏఈఓ పుష్పలత ఉన్నారు.



చాటాయివలస ఆర్‌బీకేలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న రైతులు

చురుగ్గా విత్తన నమోదు కార్యక్రమం

రేగిడి: మండలంలోని రైతుభరోసా కేంద్రాలు రైతులతో కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాల కోసం రైతులు ఆర్‌బీకేలకు పరుగులు తీస్తున్నారు. రాయితీ విత్తనాల కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్నారు. మండలంలోని ఆమదాలవలస, దేవుదళ, అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం, చాటాయివలస తదితర గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద బుధవారం రైతుల వివరాలు నమోదు కార్యక్రమం చేపట్టారు.

విజయమోహన్‌కు ఐకాన్ అవార్డు

బొబ్బిలి: పట్టణంలోని పాతబొబ్బిలికి చెందిన డెల్టా అధ్యక్షుడు (జిల్లా ఆంగ్ల ఉపాధ్యాయుల సంఘం) మింది విజయమోహనరావుకు కైట్స్ క్రాఫ్ట్ సంస్థ ఇండియన్ ఐకాన్ అవార్డును అందజేసింది. బుధవారం ప్రశంసా పత్రం, మెమెంటోను అందజేశారు. విద్యార్థులను చైతన్య పరచడంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఎంపిక చేశారు. అవార్డు అందుకోవడంపై డెల్టా సభ్యులు ఆయన్ను అభినందించారు.



మెమెంటో, ప్రశంసా పత్రంతో విజయమోహనరావు

జేవీకే కిట్లు సకాలంలో పంపిణీకి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష సీఎంఓ ఆదినారాయణ

తెర్లాం: జగనన్న విద్యాకానుక పథకం మండల స్థాయి పంపిణీ కేంద్రాన్ని సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ ఆదినారాయణ బుధవారం తనిఖీ చేశారు. విద్యాకానుకలు నిల్వ కేంద్రంలో గల వసతులు, భద్రతా ఏర్పాట్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం కేంద్రం వద్ద ఎంఈఓలు, సీఆర్‌పీలు, మండల స్థాయి పంపిణీ కేంద్రం ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు.

2024–25 విద్యా సంవత్సరంలో పంపిణీ చేయనున్న జగనన్న విద్యాకానుకలను భద్రపరచడంలోను, పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాకానుకలు పంపిణీలో సీఆర్‌పీలు కీలకపాత్ర పోషించాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు సకాలంలో పంపిణీ చేసేలా సీఆర్‌పీలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పంపిణీలో ఎటువంటి లోపం జరగకుండా ఎంఈఓలు సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ సీఎంఓ రామారావు, ఎంఈఓలు జె.త్రినాథరావు, పాపారావు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

రామభద్రపురం: మొక్కల పెంపకంపై నీటియాజమాన్య సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఉపాధి హామీ ఏపీడీ కె.జనార్దన్ అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులకు ఉపయోగకరంగా ఉండేలా పనులు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల్లో 1200 ఎకరాలలో పండ్ల మొక్కలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 300 ఎకరాలలో వేసేందుకు రైతులను గుర్తించామన్నారు. రైతులు సాగు చేసే భూమి చుట్టూ బౌండరీ ట్రెంచ్ పనులు, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఫీడర్స్ ఛానళ్లలో పేరుకుపోయిన పూడిక తీయడం వల్ల వర్షపు నీరు చెరువుల్లోకి చేరుతుందన్నారు. వేతనదారులు నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేపడితే రోజుకు రూ.300 వరకు వేతనం లభిస్తుందన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం సమయంలో పనులు చేయాలని, వేతనదారులు తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ జనార్దన్

ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష

రాజాం సిటీ: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు బుధవారం సమీక్ష నిర్వహించారు. వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. మొక్కల పెంపకం, ఫారం పాండ్ల నిర్మాణంపై వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో పొలం సారవంతం

రేగిడి: రైతులు ఖరీఫ్‌కు ముందు పంటపొలాల్లో నవధాన్యాలను వేయడం వల్ల భూమి సారవంతమవడమే కాకుండా జీవ వైవిధ్యం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో సర్పంచ్ కరణం గోవిందరావుకు చెందిన ఐదెకరాల పొలంలో బుధవారం 30 రకాల నవధాన్యాల విత్తనాలను వేయించారు.

రైతులు ఖరీఫ్ దుక్కులు చేసే సమయంలో నవధాన్యాల విత్తనాలు వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. తరువాత సాగుచేసే పంటలకు పోషకాలు సమృద్ధిగా అందుతాయని, ఫలితంగా అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులంతా నవధాన్యాలను సాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ఐసీఆర్‌పీలు ఐ.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాలను పొలంలో వేయిస్తున్న దృశ్యం

పచ్చిరొట్టతో నేల సారవంతం

రేగిడి: పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేల సారవంతంగా ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో పీఎండీఎస్ క్రాప్ కటింగ్ కార్యక్రమంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువులతో కలిగే లాభాలను వివరించారు. 18 రకాల పప్పుగింజల విత్తనాలను దమ్ముకు ముందు పొలంలో వేయడం వల్ల నేలకు మంచి సత్తువ వస్తుందన్నారు. కిలో పచ్చిరొట్ట ఎరువు వందకిలోల పశువుల ఎరువుతో సమానమని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



రేగిడి: లచ్చన్నవలసలో ఉపాధిపనులు పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథరావు



వంగర: అరసాడలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న ఈసీ హరినారాయణ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉపాధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వేసవి ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం, సాయంత్రం సమయాల్లో పనులు చేయిస్తున్నారు. పని ప్రదేశం వద్ద తాగు నీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. వేతనదారులు గరిష్ట వేతనం వచ్చేలా ముందుగా కొలతలు నిర్దేశించి పనులు చేయిస్తున్నారు. అధికారులు బుధవారం పనులను పర్యవేక్షించి మస్తర్లు తనిఖీ చేస్తున్నారు. సాగునీటి కాలువలు, చెరువల్లో పూడికలు తొలగింపు, ఫారమ్ పాండ్‌ల ఏర్పాటు, ట్రంచ్‌ల ఏర్పాటు, పండ్ల తోటల పెంపకం, తదితర పనులకు ప్రధాన్యం ఇచ్చేలా అధికాలు ప్రణాళికలు రూపొందించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



రాజాం సిటీ: పెనుబాకలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ సాయిరాం



బాడంగి: కోడూరులో సాగునీటి కాలువలో పూడికలు తొలగిస్తున్న వేతనదారులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

రామభద్రపురం:

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని శాఖా గ్రంథాలయం నిర్వాహకురాలు సత్యవాణి అన్నారు. వేసవి శిక్షణా తరగుతులలో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, వంటి స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించారు. అనంతరం విద్యార్థులతో చెస్, క్యారమ్స్, లూడో వంటి ఆటలు ఆడించారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో ఉన్న అన్ని రకాల పుస్తకాలను లైబ్రేరియన్ కృష్ణమూర్తి ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. విద్యార్థులు వారికి నచ్చిన పుస్తకాలను తీసుకుని చదువుకున్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సంబంధించి అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రామభద్రపురం: విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి



తెర్లాం: గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన

ఆంగ్లంపై భయం వీడాలి

విద్యార్థులు ఆంగ్ల భాషపై భయం వీడాలని స్థానిక హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ బి.అనూష అన్నారు. గ్రంథాలయంలో బుధవారం స్పోకెన్ ఇంగ్లిష్‌లో విద్యార్థులకు మెలకువలు బోధించారు. భయం వీడితే భాషపై పట్టు సాధించడం సులభమవుతుందన్నారు. ఇంగ్లీషును సులువుగా ఎలా నేర్చుకోవాలో వివరించారు.